ప్రజాశక్తి
సోమవారం 16 జూన్ 2025 5 విజయనగరం

ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా రమణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా జిల్లాకు చెందిన డి.వి.రమణ ఎన్నికయ్యారు. విజయవాడలో ఎపిఎన్‌జిఒ హోంలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన్ను రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఐదు సార్లు రాష్ట్ర ఉపాధ్యక్షులుగా రమణ పనిచేశారు. నిత్యం ఉద్యోగుల సమస్యలపై పోరాడుతున్న డివి రమణని ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్, కిశోర్, సురేష్, నగర అధ్యక్షులు ఆనంద్ కుమార్, నాయకులు హర్షం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఆయనకు అభినందనలు తెలిపారు.

ఇంకా కంటైనర్లలోనే చదువులు

- గిరిజన విశ్వవిద్యాలయంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం
- నత్తనడకన భవన నిర్మాణాలు

అకడమిక్ భవన నిర్మాణం ఇలా..

పేరు గొప్ప.. ఊరు దిబ్బ అన్నట్టుగా ఉంది ఉమ్మడి విజయనగరం జిల్లాల పరిధిలోని కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ పరిస్థితి. చెప్పుకోవడానికే విశ్వవిద్యాలయం. అందుకు తగ్గ సదుపాయాలు, విద్యాప్రమాణాలు కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. దీంతో విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మరోవైపు వర్సిటీ ఏర్పాటు లక్ష్యం నెరవేరడం లేదు.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

రాష్ట్ర విభజన చట్టంలో భాగంగా 2014లో జిల్లాకు మంజూరు చేసిన ఈ వర్సిటీని రకరకాల కుంటిసాకులతో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నెట్టుకొచ్చింది. 2019 ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు వర్సిటీ ఏర్పాటుకు అనుమతులు ఇచ్చినప్పటికీ శాశ్వత భవనం గానీ, వర్సిటీ స్థాయికి తగ్గట్టు కోర్సులు గానీ లేవు. ఉన్న కోర్సులకు తగినంత అధ్యాపకులను గానీ నియమించలేదు. ఈ నేపథ్యంలో విజయనగరం మెడికల్ కళాశాలకు సమీపంలోని ఆంధ్రా యూనివర్సిటీకి చెందిన భవనంలో 120 అడ్మిషన్లతో అప్పట్లో ప్రారంభమైంది. సుమారు 500 మంది విద్యార్థులు ఉన్నారు. తగినంతగా తరగతి గదులు లేవు. దీంతో, వరండాలను సైతం తరగతి గదులుగా మార్చారు. కంటైనర్లలో లేబోరేటరీలు ఏర్పాటు చేశారు. అధునాతన పరికరాలు ఉన్నా వాటిని వినియోగంలోకి తేలేని పరిస్థితి దాపురిస్తోందని అధ్యాపక బృందం ఆవేదన వ్యక్తం చేస్తోంది. విలువైన పుస్తకాలు ఉన్నా ప్రత్యేకించి లైబ్రరీ లేదు. విద్యార్థుల ఆటపాటలకు స్థలం, వ్యాయామశాల కూడా కరువే.

వర్సిటీలో ప్రస్తుతం ఎంఎ ఇంగ్లీష్, ఎంఎ సోషియాలజీ, ఎంఎ ట్రైబల్ స్టూడెంట్స్, ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, మాస్టర్ ఆఫ్ జర్నలిజం, మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్, మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్ వంటి ఎనిమిది పోస్టుగ్రాడ్యుయేట్ కోర్సులతోపాటు మరో ఆరు అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులు ఉన్నాయి. సాధారణంగా ప్రతి పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుకు తక్కువలో తక్కువగా ఒక ప్రొఫెసర్, ఇద్దరు అసోసియేట్ ప్రొఫెసర్లు, నలుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్ల చొప్పున మొత్తం ఏడుగురు ఉండాలి. ఈ లెక్కన వర్సిటీలో మొత్తం ఉన్న విద్యార్థుల సంఖ్యను బట్టి 98 మంది అధ్యాపకులు అవసరం. కానీ, కేవలం 18 మంది మాత్రమే పర్మినెంట్ అధ్యాపకులు ఉన్నారు. మిగిలిన 80 మంది గెస్ట్ లెక్చరర్లను నియమించారు. వీరిలో 30 మంది మాత్రమే నేరుగా తరగతి గదుల్లో చదువులు బోధిస్తున్నారు. మిగిలిన 50 మంది దూరదృశ్య తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ పోస్టుల భర్తీకి కేంద్ర విద్యాశాఖ మీనమేషాలు లెక్కిస్తోంది.

ప్రారంభ దశలోనే ఉన్న బాలుర వసతిగృహ భవన నిర్మాణం

ఇదీ శాశ్వత నిర్మాణాలకు నిధుల పరిస్థితి

2019 సాధారణ ఎన్నికలకు ముందు కొత్తవలస మండలం రెల్లి రెవెన్యూ పరిధిలో 526 ఎకరాలను వర్సిటీ కోసం కేటాయించారు. హడావుడిగా ప్రహరీ గోడల నిర్మాణం కూడా చేపట్టినప్పటికీ, 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల సరిహద్దులోని మెంటాడ మండలం చినమేడపల్లి రెవెన్యూ పరిధిలోకి మార్పుచేసింది. ఇందుకోసం 561.88 ఎకరాలను భూమి సేకరించింది. 2023 ఏడాది ఆగస్టు 25న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి రెండో సారి శంకుస్థాపన చేశాయి. వర్సిటీ నిర్మాణానికి రూ.834 కోట్లు కేటాయించినట్టు శంకుస్థాపనకు వచ్చిన అప్పటి సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, అప్పటి కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ ప్రకటించారు. 2027 నాటికి ఈ పనులు పూర్తిచేసేందుకు మినిస్ట్రీ ఆఫ్ స్టీల్ అండర్‌లోని మెకాన్ ఇండియా కంపెనీ ఒప్పందం కుదుర్చుకుని పనులు చేపట్టింది. రూ.305 కోట్ల వ్యయంతో ఫేజ్ -1 పనులు చేపట్టారు. ఇప్పటి వరకు కొన్ని భవనాలు మాత్రమే మొదటి ఫ్లోర్ వరకు పూర్తయ్యాయి. అటు కేంద్ర నిర్లక్ష్యానికి తోడు రాష్ట్ర ప్రభుత్వం కూడా పెద్దగా పట్టించుకోకపోవడమే ఇందుకు కారణం. ఇప్పటికైనా దృష్టిసారించాలని పలువురు కోరుతున్నారు.

యోగాడేలో అందరి భాగస్వామ్యం

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనిత

ప్రజాశక్తి-కంటోన్మెంట్

జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులతో సమావేశమైన ఇన్‌ఛార్జి మంత్రి అనిత

ఈ నెల 21న విశాఖలో నిర్వహించే యోగాడే కార్యక్రమంలో అందరి భాగస్వామ్యం ఉండాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. ఈ కార్యక్రమంపై జిల్లా ఎమ్మెల్యేలతో మంత్రి అనిత, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర యాదవ్, ఎపి మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య… ఆదివారం స్థానిక అశోక్ బంగ్లాలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విశాఖలో జరిగే యోగా డే కార్యక్రమానికి ప్రధాని మోడీ హాజరవుతున్నారని, దీన్ని సిఎం చంద్రబాబు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారని తెలిపారు. పార్టీ శ్రేణులంతా పూర్తి బాధ్యత తీసుకుని, విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున, ఎమ్మెల్యేలు కోళ్ల లలితకుమారి, పూసపాటి అదితి గజపతి రాజు, లోకం మాధవి, మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్ మల్లిక్ నాయుడు, పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి ఐ.వి.పి. రాజు, సీనియర్ నాయకులు కొండపల్లి కొండబాబు పాల్గొన్నారు.

నాయకులతో సమావేశం

యోగాడేను విజయవంతం చేయాలని స్థానిక అశోక్ బంగ్లాలో ఎమ్మెల్యే అదితి గజపతిరాజు ఆధ్వర్యంలో పార్టీ నాయకులతో టిడిపి రాష్ట్ర పరిశీలకులు ఎస్.వి.ఎస్.ఎన్.వర్మ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీవరప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఆల్తి బంగారుబాబు, మండల అధ్యక్షులు బొద్దుల నరసింగరావు, ప్రధాన కార్యదర్శి గంటా పోలినాయుడు, ఎఎంసి చైర్మన్ కర్రోతు వెంకట నరసింగరావు, తెలుగు మహిళా జిల్లా ప్రధాన కార్యదర్శి అనురాధ బేగం, రాష్ట్ర నాయకులు విజ్జపు ప్రసాద్, కంది మురళి నాయుడు, నాయకులు అవనాపు విజయ్, మాతా బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

కూటమి ఏడాది పాలనలో విధ్వంసమే

వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు, నాయకులు

టిడిపి కూటమి ఏడాది పాలనలో విధ్వంసం తప్ప అభివృద్ధి ఏమీ లేదని వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు తేల్చిచెప్పారు. ఆదివారం నగరంలోని తన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం అనే పుస్తకాన్ని వైసిపి నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి కూటమి ఎన్నికల్లో 140 హామీలు ఇచ్చిందని, వాటిలో సూపర్ సిక్స్ పథకాలు ప్రధానమైనవని తెలిపారు. పింఛను రూ.4 వేలకు పెంచామని గొప్పగా చెబుతున్నారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త పెన్షన్ ఇచ్చారా? అని ప్రశ్నించారు. స్పౌజ్ పించన్లు తప్ప కొత్తవేవీ ఇవ్వడం లేదన్నారు. తల్లికి వందనం పథకంలో రూ.15 వేలు ఇస్తామని చెప్పి రూ.13 వేలు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. ఉచిత బస్సు హామీనిచ్చి, దానిపై నేటికీ స్పష్టత ఇవ్వలేదన్నారు. వైసిపి సోషల్ మీడియా కార్యకర్తలపై, పార్టీ నాయకులపై కేసులు పెట్టి వేధించడం మొదలుపెట్టారని ఆగ్రహం వ్యక్తంచేశారు. చివరికి మీడియా ప్రతినిధులపైనా, మీడియా సంస్థలపైనా దాడి చేయడం దారుణమన్నారు. ప్రభుత్వం తలదించుకునేలా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని, ప్రజాస్వామ్యంలో ఉన్నామని తెలుసుకొని పాలకులు వ్యవహరించాలని హితవుపలికారు. పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేస్తామని చెప్పిన డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ చేసింది ఏమిటని ప్రశ్నించారు. ఒక్క రూపాయి నిధులు స్థానిక సంస్థలకు, జెడ్‌పిలకు రాలేదన్నారు. నిధులు ఇస్తున్నట్లు జిఒ విడుదల చేసి రెండు నెలలు కావస్తున్నా నేటికీ పైసా రాలేదన్నారు. తక్షణమే జనరల్ ఫండ్, 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. భోగాపురం విమానాశ్రయ పనులు తమ ప్రభుత్వంలో ప్రారంభించినవే జరుగుతున్నాయి తప్ప ఈ ప్రభుత్వంలో ఒక ఎకరా భూ సేకరణ చేపట్టలేదని స్పష్టంచేశారు. అప్రోచ్ రోడ్లు నేటికీ ప్రారంభం కాలేదన్నారు. కొత్తవలసలో జిందాల్ ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమ మూతపడిందని, కొత్త పరిశ్రమలు, కొత్త ఉద్యోగాలు ఏమైనా తెచ్చారా? అని ప్రశ్నించారు. ధాన్యం బకాయిలు రూ.500 కోట్లు పైగా చెల్లించలేదన్నారు. సమావేశంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి కెవివి సూర్యనారాయణ రాజు, నాయకులు నెక్కల నాయుడుబాబు, వేణు, అనంతం, నరసింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో సత్తాచాటిన జిల్లా క్రీడాకారులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పతకాలతో క్రీడాకారులు

ఈ నెల 14, 15 తేదీల్లో గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగిన రాష్ట్ర సీనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా అథ్లెట్లు నాలుగు బంగారు, ఒక రజత పతకాలు సాధించారు. జిల్లా నుంచి ఎనిమిది మంది అథ్లెట్లు పాల్గొనగా, ఐదు పతకాలు వచ్చాయి. జి.లక్ష్మి లాంగ్ జంప్‌లో బంగారు పతకం, పి.వసంత 100 మీటర్ల పరుగులో బంగారు పతకం, 200 మీటర్ల పరుగులో రజత పతకం సాధించారు. ఎం.బాలరాజ్ ట్రిపుల్ జంప్‌లో బంగారు పతకం, ఎస్.అశోక్ 800 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకం సాధించారు. పతకాలు సాధించిన క్రీడాకారులను జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సభ్యులు అభినందనలు తెలిపారు.

29న సిఐటియు నగర మహాసభ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సిఐటియు నాలుగో నగర మహాసభ ఈ నెల 29న ఎన్‌పిఆర్ శ్రామిక భవన్‌లో నిర్వహిస్తున్నట్లు ఆ యూనియన్ నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎ.జగన్మోహనరావు, బి.రమణ, ఉపాధ్యక్షులు రెడ్డి శంకరరావు తెలిపారు. ఆదివారం తోటపాలెంలో ఎల్‌బిజి భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలు, కార్మిక వర్గంపై ప్రభావం, గత మూడేళ్లలో సిఐటియు చేసిన పోరాటాలు, కార్యక్రమాలను సమీక్షించి భవిష్యత్తు కర్తవ్యాలను ఈ మహాసభలో రూపొందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా నగర మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో సిఐటియు నాయకులు ఆదినారాయణ, గురుమూర్తి, భాస్కరరావు, స్వప్న, రాజేశ్వరి, సురేష్, పైడిరాజు, రాజు, కృష్ణ, గౌరినాయుడు పాల్గొన్నారు.

ముత్తాయివలసలో ఏనుగుల సంచారం

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

మామిడితోటలో సంచరిస్తున్న ఏనుగులు

మండలంలోని ముత్తాయివలస గ్రామ శివారులో ఆదివారం ఏనుగులు సంచరిస్తున్నాయి. గ్రామస్తులు వాటిని చూసేందుకు ఎగబడ్డారు. విషయం తెలుసుకున్న డిఎఫ్ఒ కొండలారావు, ఇఎంఇ రేంజ్ ఆఫీసర్ మణికంటేష్ సంఘటనా స్థలానికి వెళ్లి ప్రజలను అప్రమత్తం చేశారు. ఈ సందర్భంగా డిఎఫ్ఒ మాట్లాడుతూ ఈ సీజన్‌లో తరచూ ఏనుగుల సంచారం ఈ ప్రాంతంలో జరుగుతుందన్నారు. ముత్తాయివలసలో ఆదివారం తూముల శ్రీనివాసరావు మామిడి తోటలోకి 9 ఏనుగులు ప్రవేశించాయని, పిల్ల ఏనుగు వాటితో పాటు ఉందని తెలిపారు. కోటసీతారాంపురం నుండి ఇక్కడకు చేరుకున్నాయని తెలిపారు. వీటి దగ్గరకు ఎవరూ పోవద్దని తెలిపారు. ఈ విషయమై గ్రామాల్లో దండోరా వెయిస్తామని చెప్పారు. ఆయనతోపాటు విజయనగరం రేంజ్ ఆఫీసర్ అప్పలరాజు, ఎఫ్‌బిఒ స్వప్న తదితరులు ఉన్నారు.

వైసిపిది విష ప్రచారం

ఎమ్‌పి కలిశెట్టి అప్పల నాయుడు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

తల్లికి వందనం పథకంతో తల్లులు ఆనందంగా ఉండటం చూసి ఓర్వలేక వైసిపి నాయకులు విషం కక్కుతున్నారని ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు విమర్శించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంట్లో ఎంతమంది విద్యార్థులు ఉంటే అంతమందికీ తల్లికి వందనం ద్వారా రూ.15 వేలు చొప్పున ఇస్తుంటే వైసిపి నేతలు తప్పుడు ప్రచారాలు చేస్తూ విద్యార్థులకు తీరని ద్రోహం చేస్తున్నారని తెలిపారు. కనీసం తల్లికి కూడా గౌరవం ఇవ్వలేని జగన్ రెడ్డి నేడు తల్లికి వందనం గురించి మాట్లాడడం సిగ్గుచేటని పేర్కొన్నారు. వైసిపి పాలనలో రూ.13 వేలు ఇచ్చారని, అంటే రూ.2 వేలు జగన్ జేబుల్లోకి పోయాయా? తాడేపల్లి ప్యాలెస్‌కు చేరాయా? అని ప్రశ్నించారు. జగన్ పాలనలో 42 లక్షల మందికి మాత్రమే ఇస్తే, కూటమి ప్రభుత్వం 67.27 లక్షల మంది విద్యార్థులకు తల్లికి వందనం ఇస్తుందని తెలిపారు. ఇచ్చిన మాటను సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ నిలబెట్టుకున్నారని చెప్పారు.

'అరబిందో' బెదిరింపులు ఆపాలి

ఎపి 104 ఎంఎంయు ఎంప్లాయీస్ యూనియన్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

మాట్లాడుతున్న 104 ఎంఎంయు ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు రామరాజు

104 సర్వీసులను గతంలో అరబిందో యాజమాన్యం నిర్వహించిందని, ఈ సంస్థ రెండు నెలలుగా వేతనాలు ఇవ్వకుండా ఉద్యోగులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తూ బెదిరిస్తోందని ఎపి 104 ఎంఎంయు ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి అద్దేపల్లి రామరాజు, జగన్మోహన్‌రావు ఆందోళన వ్యక్తంచేశారు. వెంటనే అరబిందో యాజమాన్యం బెదిరింపులు ఆపాలని డిమాండ్‌చేశారు. ఆదివారం కెఎల్‌పురంలోని ఎన్‌పిఆర్ భవనంలో యూనియన్ జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి ఉద్యోగులకు రావాల్సిన బకాయి వేతనాలు, ఇతర బకాయిలు చెల్లించాలన్నారు. ప్రస్తుతం 104 సర్వీసులు నిర్వహిస్తున్న భవ్య హెల్త్ సర్వీస్ ప్రయివేట్ లిమిటెడ్ యాజమాన్యం కూడా ఉద్యోగులకు ప్రతి నెలా వేతనాలు చెల్లించాలన్నారు. జిల్లాలో ఖాళీగా ఉన్న స్థానాల్లో సీనియారిటీ ప్రకారం బదిలీలు చేయాలని డిమాండ్‌చేశారు. మిగతా స్థానాల్లో కొత్త నియామకాలు చేపట్టాలన్నారు. ఐదేళ్ల నుంచి మరమ్మతులకు నోచుకోని వాహనాలను వెంటనే బాగు చేయాలన్నారు. భవ్య హెల్త్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినెలా గ్రీవెన్స్ సమావేశాలు నిర్వహించి. సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు జి.అప్పలసూరి, జిల్లా ఎన్‌హెచ్‌ఎం జెఎసి కన్వీనర్ కన్వీనర్ ఎస్.బాలరాజు, కమిటీ సభ్యులు ప్రవీణ్, కోటరావు, సత్యనారాయణ, ఆర్.ఎస్.నాయుడు, జ్యోతి, హేమలత, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ చేపడుతున్న కార్మికులు

కార్మిక చట్టాల సవరణను వ్యతిరేకిస్తూ ర్యాలీ

ప్రజాశక్తి-కంటోన్మెంట్

కార్మిక చట్టాల సవరణను వ్యతిరేకిస్తూ భారతీయ మజ్దూర్ సంఘ్ ఆధ్వర్యాన నగరంలో ఆదివారం భారీ బైక్ ర్యాలీ చేపట్టారు. పూసపాటిరేగ మండలంలోని మ్యాట్రిక్స్ కంపెనీ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ సాగింది. రోజువారీ పని గంటలను పెంచడం, మహిళా కార్మికులు రాత్రి షిఫ్టులలో పని చేయడానికి అనుమతించడం వంటి వాటిని వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో బిఎంఎస్ జిల్లా అధ్యక్షులు నల్లా అప్పల రాజు, ప్రధాన కార్యదర్శి గుడివాడ రమణ, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యే లక్ష్యం

- నెలాఖరులోగా కళాశాలలో చేరిన విద్యార్థులకు తల్లికి వందనం
- 'ప్రజాశక్తి'తో డిఐఇఒ ఎస్.తవిటినాయుడు ముఖాముఖి

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

'2025-26 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్‌లో మెరుగైన ఫలితాలు వచ్చేలా నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నాం. విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి ప్రత్యేక కార్యాచరణను అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అమలు చేస్తున్నామ'ని జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖాధికారి శివ్వాల తవిటినాయుడు తెలిపారు. ఈ వారం తనను కలిసిన 'ప్రజాశక్తి'కి ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. రానున్న ఏడాది కాలంలో ఇంటర్ విద్యాభివృద్ధి కోసం తీసుకుంటున్న చర్యల గురించి వివరించారు. ఆ వివరాలు...

జూనియర్ కళాశాలలకు సొంత భవనాలు ఉన్నాయా.?

జిల్లాలో ఉన్న 18 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 17 చోట్ల సొంత భవనాలు ఉన్నాయి. దత్తిరాజేరులో ఉన్న కాలేజీకి సొంత భవనం లేక ప్రభుత్వ హైస్కూల్లో తరగతులు నిర్వహిస్తున్నాం. సొంత భవనం కోసం ప్రతిపాదనల పంపించాం. జూనియర్ కళాశాలల్లో మన బడి - మన భవిష్యత్తు పథకం ద్వారా పక్కా భవనాలు, ఫర్నిచర్, మరుగుదొడ్లు, నీరు, లైబ్రరీ, ల్యాబ్ వంటి సౌకర్యాలు కల్పిస్తున్నాం. ఆహ్లాదకరమైన వాతావరణంలో మంచి విద్యను అందించేందుకు కృషి చేస్తున్నాం.

జిల్లాలో ఎన్ని జూనియర్ కళాశాలలు ఉన్నాయి?

జిల్లాలో అన్ని విభాగాల్లో 183 జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలలు18, మోడల్ స్కూల్స్ 13, కెజిబివిలు 26, సాంఘిక సంక్షేమ గురుకులాలు 8, గురుకుల పాఠశాల 1, బిసి గురుకులం 1, అప్‌గ్రేడ్ అయిన హైస్కూల్ ప్లస్ కళాశాలలు 8, ప్రయివేటు జూనియర్ కళాశాలలు 108 ఉన్నాయి.

జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న ప్రిన్సిపల్, అధ్యాపకుల పోస్టుల భర్తీకి తీసుకుంటున్న చర్యలేమిటి.?

జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉన్న ప్రిన్సిపల్స్ పోస్టులు పూర్తి స్థాయిలో ఇటీవల బదిలీలు, ఉద్యోగోన్నతుల్లో భర్తీ చేశాం. వీటితో పాటు అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పూర్తి స్థాయిలో అధ్యాపక పోస్టులు భర్తీ చేశాం. పూర్తి స్థాయిలో అన్ని సబ్జెక్టులకు అధ్యాపకులను నియమించాం.

జిల్లాకు ఎన్ని పాఠ్యపుస్తకాలు వచ్చాయి? పంపిణీ పూర్తయిందా.?

జిల్లాలో ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు పూర్తి స్థాయిలో అంటే, 57 వేల పాఠ్యపుస్తకాలు వచ్చాయి. వీటితో పాటు నోట్ పుస్తకాలు కూడా ప్రతి విద్యార్థికి 12 చొప్పున ఇచ్చేందుకు 96 వేలు వచ్చాయి. వాటి పంపిణీ కూడా జరుగుతోంది. విద్యార్థులపై ఆర్థిక భారం పడకూడదనే ఉద్దేశంతో సైన్స్ విద్యార్థులకు ఉచితంగా రికార్డులు కూడా అందిస్తున్నాం.

మెరుగైన ఫలితాల సాధనకు అమలు చేస్తున్న కార్యాచరణ.?

గతేడాది కంటే మెరుగైన ఫలితాలు ఉండేలా ఈ ఏడాది ప్రారంభం నుంచే ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. బోధించే ప్రతి పాఠ్యాంశంపై పరీక్ష పెట్టి విద్యార్థులను సంసిద్ధం చేస్తున్నాం. అధ్యాపకులకు ఆరు గంటలే విద్యా బోధన ఉంటే గంట కాలం పెంచాం. ఆ సమయంలో అదనపు తరగతులు నిర్వహించి విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తున్నారు. విద్యార్థుల సామర్థ్యాలకు అనుగుణంగా బోధన, చదివించడం ద్వారా వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. నిరంతరం విద్యార్థుల ప్రగతిపై దృష్టి పెట్టి వారికి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు వచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం. ఈమేరకు అధ్యాపకులకు ఆదేశాలు ఇచ్చాం.



విద్యా ప్రమాణాలు పెంచేందుకు తీసుకున్న చర్యలు ఏమిటి?

ఇంటర్ విద్యతోపాటు కనీసం 40 శాతం మంది విద్యార్థులను ఇంజినీర్లుగా చూడాలనే లక్ష్యంతో పోటీ పరీక్షలకు శిక్షణ కూడా ఇస్తున్నాం. ప్రయివేటు, కార్పొరేట్ కళాశాలల్లో అందుతున్న విద్యను ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అందించేలా శిక్షణ ఇచ్చి విద్యార్థులను ప్రోత్సహిస్తున్నాం. అన్ని రకాల విద్యా ప్రమాణాలు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులు చేరాలి.

తల్లికి వందనం పథకంపై విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది. అందరికీ అమలవుతుందా.?

తల్లికి వందనం పథకంపై విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఎటువంటి అపోహలూ అవసరం లేదు. ఈ పథకం ద్వారా విద్యార్థులందరికీ డబ్బులు రానున్నాయి. ద్వితీయ ఇంటర్ విద్యార్థులకు ఇప్పటికే డబ్బులు పడుతున్నాయి. మొదటి సంవత్సరంలో ఈ నెల 30వ తేదీలోపు కాలేజీల్లో చేరిన వారికి పథకం వర్తిస్తుంది. కాలేజీల్లో చేరిన వెంటనే రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. జులై ఐదో తేదిలోపు వారి తల్లుల ఖాతాల్లో డబ్బులు జమవుతాయి.

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఎంతమంది విద్యార్థులు ఉన్నారు? విద్యార్థుల సంఖ్య పెంచేందుకు తీసుకున్న చర్యలు ఏమిటి.?

జిల్లాలో ఇంటర్ బోర్డు పరిధిలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 18 ఉన్నాయి. వాటిలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 2124 మంది ఉన్నారు. మొదటి ఏడాదిలో ఇప్పటి వరకు 1400 మంది చేరారు. ఈ నెలాఖరు వరకు పదో తరగతిలో ఉత్తీర్ణులైన వారిని గుర్తించి, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులను చేర్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం. అందుకోసం కాలేజీ అధ్యాపకులు విద్యార్థుల వద్దకు వెళ్తున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఉచిత విద్యతో పాటు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు అందిస్తున్నాం. మధ్యాహ్న భోజనం అమలవుతోంది.

నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

రెవెన్యూ సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-కంటోన్మెంట్

రెవెన్యూ సంఘం జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికైంది. స్థానిక రెవెన్యూ హోంలో ఆదివారం ఎన్నికలు జరిగాయి. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల అధ్యక్షులు ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. జిల్లా అధ్యక్షులుగా తాడ్డి గోవింద, కార్యదర్శిగా ఐ.సూర్యనారాయణ, ఇతర కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలకు జిల్లాలోని రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు హాజరయ్యారు. నూతన కార్యవర్గాన్ని అభినందించారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సతివాడ, రామతీర్థం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 11కెవి ఆర్‌డిఎస్‌ఎస్, ఎజిఎస్ సర్వీసెస్ (వ్యవసాయ కనెక్షన్ పనులు) కొనసాగుతున్నందున ఈనెల 16న విద్యుత్ అంతరాయం కలుగుతుందని విజయనగరం టౌన్ డిఇఇ పి.త్రినాథరావు ప్రకటనలో తెలిపారు. సతివాడ 33/11కెవిసబ్ స్టేషన్ పరిధిలో రామతీర్థం 11కెవి రూరల్ ఫీడర్, ఒమ్మి రూరల్ ఫీడర్ పరిధిలో వ్యవసాయ కనెక్షన్ నిర్మాణపనులు కొనసాగింపు, చెట్లు తొలగించడం, సాంకేతిక సమస్యలు పరిష్కారం కోసం మధుపాడ, పినతరిమి, పెదతరిమి, బొప్పడాం, వల్లూరు, బొడ్డపేట బుచ్చన్నపేట, ఒమ్మి, మల్యాడ, వెంకుపాలెం, గ్రామాలకు సోమవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - బొండపల్లి

మాట్లాడుతున్న సిఐటియు నాయకురాలు లక్ష్మి

జులై 9వ తేదీన దేశ వ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాలు ఉద్యోగ సంఘాలు ఒకరోజు సమ్మెకు పిలుపునిచ్చాయని ప్రతి ఒక్కరూ పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.లక్ష్మి కోరారు. పి.కుమారి అధ్యక్షతన బొండపల్లిలో కార్మికులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం మూడోసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత 42 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్లను తీసుకువచ్చిందన్నారు. ఇవి అమలు చేయాలని చెప్పి ఫిబ్రవరి 5వ తేదీన పార్లమెంట్లో ఆమోదానికి పెట్టాలని ప్రయత్నం చేస్తే దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలన్నీ తీవ్రంగా వ్యతిరేకించాయన్నారు. ఈ కుట్రను అడ్డుకోవడం కోసం చేస్తున్న సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో హైమా, శాంతి, కనక, రామ్ బంట్లు, కార్మికులు పాల్గొన్నారు.

జనసేనలో పలువురు చేరిక

ప్రజాశక్తి - భోగాపురం

భోగాపురం మేజర్ పంచాయతీకి చెందిన పలువురు ఆదివారం జనసేన పార్టీలో చేరారు. భోగాపురం జనసేన పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు లోకం ప్రసాద్ పార్టీలో చేరిన వారందరికీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆ పార్టీ నాయకులు బొల్లు త్రినాథ్, మాత నవీన్ ఆధ్వర్యంలో వీరంతా పార్టీలో చేరారు. నాయకులు పల్లంట్ల జగదీష్, వందనాల రమణ, వరుపుల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

రైతుల బయోమెట్రిక్ తప్పనిసరి

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని సింగరాయి సచివాలయం పరిధిలో గల సింగరాయి, జగ్గయ్యపేట, అరిగి పాలెం గ్రామాల రైతులు అన్నదాత సుఖీభవ పథకానికి తప్పనిసరిగా బయోమెట్రిక్ వేయాలని విఎఎ కోమలి కోరారు. వ్యవసాయ సాగు చేస్తున్న రైతులందరూ ఈ విషయాన్ని గుర్తించుకొని రైతు సేవా కేంద్రం వద్దకు ఆధార్ కార్డు తీసుకుని వచ్చి బయోమెట్రిక్ చేసుకోవాలన్నారు. రైతులకు ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన విత్తనాలు కావలసిన రైతులు రైతు సేవా కేంద్రం వద్దకు ఉదయం 10 గంటలకు వచ్చి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. సేవా కేంద్రంలో ఎంటియు 1121, సోనా మసూరి వంటి రకాలు అందుబాటులో ఉన్నాయన్నారు.

ఉచిత వైద్య శిబిరం విజయవంతం

వేపాడ : మండలంలోని పాటూరు గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ వైద్య శిబిరంలో 98 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో కంటి శస్త్ర చికిత్సకు 59 మందిని ఎంపిక చేశారు. శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో వైద్యులు దేవి, నర్స్ లావణ్య, క్యాంపు కోఆర్డినేటర్ ఎస్ జోగారావులు, ఈ వైద్య శిబిరానికి సహకరించిన బండిలి రామకృష్ణ పాల్గొన్నారు.

నవధాన్యాల కిట్లు అందజేత

ప్రజాశక్తి -సంతకవిటి

మండలంలోని గుళ్ల సీతారాంపురంలోని ఆదర్శ రైతు కంబాల దశప్పడుకు 12 కేజీల నవధాన్యాల కిట్‌ను యూనిట్ ఇంచార్జి పాత్రుని వెంకటరమణ ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ నవధాన్యాల సాగులు ఎకరాకు 8 నుంచి 10 టన్నుల పచ్చిరొట్ట ఎరువు తయారవుతుందన్నారు. దీనివల్ల రైతులకు ఎరువులు, పురుగుల మందుల వాడకం తగ్గి కలుపు నివారణ అవుతుందని అన్నారు. ఆరోగ్యకరమైన ఆహారం తినవచ్చు అని అన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి

ప్రజాశక్తి - పూసపాటిరేగ

ఆటోలోనే మృతి చెందిన డ్రైవర్

మండలం లోని గొల్లపేట సమీపంలో జాతీయ రహదారి సర్వీస్ రోడ్డుపై ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని కలగు పేటకు చెందిన ఆటో డ్రైవర్ జీరు కనకరెడ్డి (40) అక్కడికక్కడే మృతి చెందాడు. ఆగి ఉన్న లారీని వెనక నుంచి వచ్చి ఆటోతో బలంగా ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. మృతుడు ఆదివారం ఉదయం తమ స్వగ్రామం కలగుపేట నుండి మండలంలోని చోడమ్మ అగ్రహారానికి ఆటోలో కూరగాయలు తెచ్చారు. కూరగాయలు దించి తిరిగి తమ స్వగ్రామానికి వెళ్తుండగా గొల్లపేట వద్ద సర్వీస్ రోడ్ లో ఆగి ఉన్న లారీని ఢీ కొట్టాడు. పూసపాటి రేగ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని మహిళ మృతి

కంటోన్మెంట్: నగరంలోని ఊటగెడ్డ సమీపంలో రైలు ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి చెందింది. విజయనగరం, నెల్లిమర్ల మధ్యలో ఊటగెడ్డ వద్ద మహిళ మృతదేహం ఉండటంతో స్థానికులు గుర్తించి శ్రీకాకుళం రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. మృతురాలి వయస్సు సుమారు (50) ఉంటుందని రైల్వే పోలీసులు తెలిపారు. మృతురాలి వివరాలు తెలిసిన వారు జిఆర్‌పి ఎస్ఐ నంబర్ 9493474582కు సమాచారమివ్వాలన్నారు.

భార్య మందలించిందని...

డెంకాడ: మండల పరిధిలో అక్కివరం సమీపంలోని ఒక ప్రైవేట్ లేఔట్‌లో భోగాపురం మండలం సవరవిల్లి గ్రామానికి చెందిన బోర సూరిబాబు (35) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భోగాపురం ఎయిర్ పోర్టులో బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్న సూరిబాబు గత కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ప్రస్తుతం బస్సు డ్రైవర్ కూడా మానేసి వారం రోజులుగా తాగుతూ తిరుగుతున్నాడు. శనివారం రాత్రి 8 గంటల సమయంలో మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. దీంతో భార్య గౌరీ భర్తను మందలించింది. మనస్తాపం చెంది బహిర్భూమికి వెళ్లి వస్తానని చెప్పి రాత్రి 9.30గంటల ప్రాంతంలో బయటకు వెళ్లిపోయాడు. ఉదయం లేచేసరికి అక్కివరం వద్ద ప్రైవేట్ లేఔట్‌లో కరెంటు స్తంభానికి ఉరివేసుకొని చనిపోయాడని తనకు సమాచారం ఇచ్చారని భార్య తెలిపింది. మృతునికి ఇద్దరు ఆడపిల్లలు, భార్య ఉన్నారు. ఎస్ఐ ఎ.సన్యాసినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

52 మందికి ఒక్కటే గది

- ప్రభుత్వ పాఠశాలల్లో తప్పని అవస్థలు
- పూర్తికాని అదనపు భవనాల నిర్మాణం
- బాత్‌రూమ్‌లకు తలుపులు లేక ఇబ్బందులు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ప్రభుత్వాలు మారుతున్నా ఎక్కడి సమస్యలు అక్కడే ఉంటున్నాయి. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలలు సమస్యలు సుడిగుండంలో కొట్టు మిట్టాడుతున్నాయి. మండలంలో నాడు - నేడు పథకం కింద మంజూరైన పాఠశాలల అదనపు భవనాలకు నిర్మాణం పూర్తి కాకపోవడంతో ఆయా పాఠశాలల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా పినతరమిలో ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకూ 52 మంది విద్యార్థులుండగా వారంతా ఒకే గదిలో చదువుతున్నారు. ఇటువంటి పాఠశాలలు మండలంలో కోకొల్లలు. ప్రభుత్వం స్పందించి నిధులు మంజూరు చేసి నిర్మాణంలో ఉన్న భవనాలను పూర్తి చేయాలని కోరుతున్నారు.

మండలంలోని నాడు-నేడు రెండో విడతలో మొత్తం 49 పాఠశాల్లో సుమారు రూ.10.24 కోట్ల అంచనా నిధులతో 10 కాంపోనెంట్ పనులతో పాటు అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు చేపట్టేందుకు గత ప్రభుత్వంలో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. పనుల కోసం సుమారు రూ.9.10 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. వీటిలో సుమారు రూ.5.56 కోట్లను ఖర్చు పెట్టి అదనపు భవన నిర్మాణాలు చేపట్టింది. తరువాత ప్రభుత్వం మారడంతో సుమారు ఆరు పాఠశాలల్లో పనులు చివరి దశలో నిలిచిపోయాయి. ఖాతాల్లో నిధు లున్నప్పటికీ పనులు చేపట్టేందుకు ప్రభుత్వం ముందుకు రావడం లేదు. రామతీర్థం, సతివాడ ఉన్నత పాఠశాలలో భవన నిర్మాణ పనులు చివరి దశలో నిలిచిపోయాయి. పాఠశాలలు పునః ప్రారంభమైన నేపథ్యంలో అదనపు భవనాలు పూర్తి కాకపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పవని తల్లిదండ్రులు వాపోతున్నారు.

తలుపులు లేని బొప్పడాం వసతిగృహ మరుగుదొడ్లు

రామతీర్థంలో అసంపూర్ణంగా ఉన్న అదనపు భవనం

నిలిచిన అదనపు భవనాలు

రామతీర్థం ఉన్నత పాఠశాలలో 1 నుంచి పదో తరగతి వరకు సుమారు 378 మంది విద్యార్థులు ఉండగా 12 తరగతి గదులు ఉన్నాయి. నాలుగు అదనపు భవనాలు మంజూరు కాగా చివరి దశలో పనులు నిలిచిపోయాయి. సతివాడ ఉన్నత పాఠశాలలో ఆరు నుంచి 10 వరకు సుమారు 352 మంది విద్యార్థులుండగా ఎనిమిది తరగతి గదుల్లో విద్యార్థులు సర్దుకుంటున్నారు. ఇక్కడ కూడా నాలుగు అదనపు భవనాల పనులు చివరి దశలో నిలిచిపోయాయి. తరగతి గదులు చాలకపోవడంతో విద్యార్థులు వరండాల్లోనూ, అంసంపూర్తి భవ నాల్లోను చదువులు సాగిస్తున్నారు.

బొప్పడాంలో తలుపులు లేకుండా బాత్ రూమ్‌లు

బొప్పడాం బీసీ బాలుర వసతిగృహంలో బాత్‌రూమ్‌లకు డోర్లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. సుమారు రెండు నెలల క్రితం వసతిగృహంలో మౌలిక వసతుల కల్పనకు సర్వశిక్ష అభియాన్ నుంచి రూ.5లక్షలు మంజూరయ్యాయి. నిధులు మంజూరైనప్పటికీ సంబంధిత కాంట్రాక్టర్ నేటికీ పనులు చేపట్టకపోవడంతో ఈ ఏడాది విద్యా సంవత్సరంలో కూడా ఇబ్బందులు తప్పేలా లేవు. వసతిగృహంలో గదులకు కిటికీలు, రన్నింగ్ వాటర్ సదుపాయం లేక తమ పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

న్యాయశాఖ హెచ్చరించినా

ఇటీవల మొయిద బీసీ బాలుర వసతిగృహాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కృష్ణప్రసాద్ ఆకస్మికంగా సందర్శించారు. వసతి గృహ ప్రారంభంలో ప్రహరీ పూర్తిగా శిథిల మవ్వడాన్ని గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రహరీ నిర్మాణానికి ఆయన కొన్ని సూచనలు కూడా చేశారు. అయినప్పటికీ ప్రహరీ గోడ నిర్మాణానికి అడుగులు ముందుకు పడలేదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ప్రహరీ లేకపో వడంతో తమ పిల్లలకు ప్రమాదం పొంచి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పిన తరిమిలో 52 మంది విద్యార్థులకు ఒకటే గది

పినతరిమిలో రెండు తరగతి గదులు ఉండగా.. ఒక భవనం పూర్తిగా శిథి లావస్థకు చేరడంతో ప్రస్తుతం ఉపయోగించడం లేదు. ఉన్న ఒక్క గదిలోనే విద్యార్థులకు చదువు చెబుతున్నారు. ఈ పాఠశాలలో 1 నుంచి 5 వరకు సుమారు 52 మంది విద్యార్థులు చదువుతుండగా.. వరండాతో పాటు ఆ ఒక్క గదిలోనే అన్ని తరగతుల పిల్లలకు బోధన సాగిస్తున్నారు. మధ్యాహ్న భోజన వంట గది కూడా పూర్తిగా శిథిలమైంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అసంపూర్తి తరగతుల గదులు నిర్మాణం, వసతి గృహల సమస్యలు, శిథిలావస్థకు చేరిన పాఠశాల మరమ్మతులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

ప్రహరీ లేని మొయిద బిసి బాలుర వసతిగృహం

రన్‌వేకు ఆటంకం వస్తుందని..

- సమీపంలో జిరాయితీ భూముల్లో పొడవైన చెట్ల తొలగింపునకు చర్యలు
- సిగ్నల్‌కు సమస్య వస్తుందని సూచించిన జిఎంఆర్ సంస్థ
- సర్వే చేసిన ఉద్యానవన, అటవీశాఖ రెవెన్యూ అధికారులు
- కొబ్బరితోపాటు 1500 చెట్లు గుర్తింపు
- పరిహారం ఇచ్చాక తొలగించాలని నిర్ణయం

ప్రజాశక్తి - భోగాపురం

రన్‌వే సమీపంలోని జిరాయితీ భూముల్లో పొడవుగా ఉన్న కొబ్బరి, తాటి చెట్లు వల్ల నావిగేషన్‌కు సంబంధించిన సిగ్నల్ సమస్య వస్తుందని వాటిని వెంటనే తొలగించాలని జిఎంఆర్ సంస్థ అధికారులను ఇటీవల కోరింది. మూడు నుంచి ఐదడుగులు లోపు ఉన్న ఎలాంటి చెట్లూ ఉండరాదని దీని వల్ల ఇబ్బందులు ఏర్పడతాయని తెలిపింది. దీంతో అధికారుల ఆదేశాల మేరకు స్థానిక రెవెన్యూ అధికారులు ఉద్యానవనశాఖ, అటవీశాఖ అధికారులతో కలిసి జిఎంఆర్ సంస్థ ప్రతినిధులు ఇటీవలి దీనిపై సర్వే చేశారు. సుమారు 1500 చెట్లు తొలగించాల్సి వస్తుందని గుర్తించారు. గుర్తించిన చెట్లకు ఇంకా ఎంత నష్టపరిహారం ఇవ్వాలనేదానపై ఎటువంటి నిర్ణయమూ అధికారులు తీసుకోలేదు.

విమానాశ్రయ నిర్మాణంలో భాగంగా సుమారు 3.8 కిలో మీటర్లు రన్‌వేను నిర్మించారు. కవులవాడ సమీపంలోని నిషాన కొయ్య దగ్గర నుంచి జమ్మయ్యపేట వరకు విమానాశ్రయం లోపల ఈ రన్‌వే నిర్మించారు. ఈ రన్‌వే సమీపంలో ప్రహరీని ఆనుకొని ఉన్న జిరాయితీ భూముల్లో పొడవైన కొబ్బరి, తాటి, నీలగిరి, టేకు వంటి తదితర చెట్లు ఉన్నాయి. కానీ చెట్లు ఉన్న ఈ ప్రాంతమంతా విమానాశ్రయంలోని రన్‌వేకు సుమారు 20 నుంచి 40 అడుగుల ఎత్తులో ఉంటుంది. దీంతో విమానాలు దిగే సమయంలో చక్కర్లు కొట్టేటప్పుడు నావిగేషన్ సిగ్నల్ సమస్య ఉంటుందని గుర్తించారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రెవెన్యూ, ఉద్యానవనశాఖ, అటవీశాఖ అధికారులు కలిసి ఉమ్మడిగా ఇటీవలి సర్వే చేశారు. గుర్తించిన చెట్లకు మార్కింగ్ కూడా వేశారు.

సుమారు 1500 చెట్లను గుర్తించిన అధికారులు

రన్‌వేకు ఆనుకొని ఉన్న జిరాయితీ భూముల్లో సుమారు 1500 చెట్లను గుర్తించారు. ఇందులో సుమారు 600 కొబ్బరి చెట్లను గుర్తించారు. మిగతా చెట్లలో నీలగిరి, టేకు, తాటి చెట్లును గుర్తించినట్లు అధికారులు చెబుతున్నారు. జిఎంఆర్ సంస్థ అధికారులు ఒక మిషన్ సాయంతో రన్‌వేకు ఎంత దూరంలో చెట్లు తొలగించాలని గుర్తించారు. విమానాశ్రయ రక్షణ గోడ నుంచి సుమారు 200 మీటర్లు నుంచి 400 మీటర్లు లోపల ఎటువంటి చెట్లూ ఉండరాదని నిర్ణయించారు. అంతేకాక ఈ భూముల్లో రానున్న రోజుల్లో కేవలం పంటలు వేసుకోవడానికి ఇబ్బందులు లేవుగాని చెట్లు పెంచేందుకు వీలుండదని నిభందనలు విధించనున్నారు. గుర్తించిన చెట్లకు సంబంధించిన నివేదికను జిల్లా అధికారులకు రెవెన్యూ అధికారులు నివేదించనున్నారు. అనంతరం ప్రభుత్వం పరిహారం ఎంత ఇవ్వాలనేది నిర్ణయించనున్నారు.

జిరాయితీ భూముల్లో సర్వే చేస్తున్న అధికారులు

తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

తల్లిదండ్రులను వేధించి, నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్ హెచ్చరించారు. ఆదివారం వృద్ధుల వేధింపుల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పూల్‌బాగ్‌లో ఉన్న ప్రేమ సమాజం వృద్ధాశ్రమాన్ని ఆయన సందర్శించారు. వృద్ధులకు న్యాయ అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా వృద్ధులకు సంబంధించిన చట్టాలు, హక్కులను వివరించారు. వారి సమస్యలను అడిగి తెలుసు కున్నారు. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులు మనకు భారం కాదని, వారు బలమని సూచించారు. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను నిరాదరణకు గురి చేస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఎవరైనా నిరాదరణ గురైతే జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించవచ్చునని, టోల్ ఫ్రీ నెంబర్ 15100కు ఫోన్ చేసి తగిన న్యాయ సహాయం పొందవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో ప్రేమ సమాజం అధ్యక్షులు పెద్దింటి అప్పారావు, ఉపాధ్యక్షులు కనకల రఘు రామారావు, జాయింట్ సెక్రెటరీ సిహెచ్ చిన్నయ్య, న్యాయవాది తాడిరాజు పాల్గొన్నారు.

గుంతల రోడ్డుపై బైఠాయించి నిరసన

ప్రజాశక్తి- వేపాడ

మండలంలోని బొద్దాం - కల్లెంపూడి రోడ్డులో పెద్ద పెద్ద గోతులు ఏర్పడటంతో చిన్నపాటి వర్షం పడినా రోడ్డు చెరువును తలపిస్తోంది. గత పదేళ్లుగా ఇబ్బందులు పడుతున్నా జిల్లా అధికారులు కానీ, ప్రజాప్రతినిధులు గాని స్పందించకపోవడంతో ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ ఆధ్వర్యంలో రోడ్డుపై ఉన్న ముడుకు లోతు నీటిలో చల్లా జగన్‌తో పాటు, గ్రామస్తులు దుకాణదారులు, బొద్దాం ఒబలయ్యపాలెం, ముకుందపురం, కళ్ళెంపూడి గ్రామానికి చెందిన పెద్దలు, యువకులు నిరసన తెలిపారు. బురద నీటిలో బైఠాయించి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా చల్లా జగన్ మాట్లాడుతూ సాధారణ ప్రజలకు అవసరం ఉన్నా లేక పోయినా గ్రీన్ ఫీల్డ్ హైవే, ఇతర హైవేల పేరుతో నియోజవర్గాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్న అధికారులు బొద్దాం, కళ్ళెంపూడి రోడ్డును పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. గత పదేళ్లుగా ఆ రోడ్డుపై వెళ్లాలంటేనే నరకయాతన పడుతున్నారని, బొద్దాం నుంచి కాకులపాలెం వెళ్లే తోవలో ఉన్న రోడ్డుకి డ్రైనేజీ సిస్టం లేక రోడ్డుపైనే నీరు ఉండిపోతోందని, ఎప్పుడో వేసిన తారు రోడ్డు మొత్తం పాడైపోవడంతో ఆ రోడ్డుపై వెళ్లే గ్రామాలే కాకుండా, ఆ రోడ్డువైపే మొత్తం దుకాణాలు ఉండడం, విద్యార్థులు, వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో పాలించిన రెండు ప్రభుత్వాలు గానీ, కూటమి ప్రభుత్వం గానీ ఆ రోడ్డుపై దృష్టి పెట్టకపోవడం విచారకరమన్నారు. వెంటనే స్థానిక ప్రజాప్రతినిధులు ఎంపీ, ఎమ్మెల్యే, జిల్లా పరిషత్ ఛైర్మన్ కలుగజేసుకొని నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలన్నారు. నెల రోజుల్లో పనులు ప్రారంభించకపోతే మూడు పంచాయతీల ప్రజలు యువకులతో బొద్దాం రోడ్డుపై నిరాహార దీక్షకు దిగుతామని హెచ్చరించారు. ఈ రోడ్డు విషయంలో ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకుడు చలుమూరు శ్యామ్, పచ్చిపులుసు నగేష్ , సాయిరాం, బొద్దాం యువకులు, విద్యార్థులు దుకాణదారులు, కార్పెంటర్లు మహిళలు పాల్గొన్నారు.

రోడ్డు గుంతల్లో బైఠాయించి నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

అంబేద్కర్ అందరివాడు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - వంగర

అంబేద్కర్ అందరివాడని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. మండలంలోని కొప్పరవలసలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని ఆయన ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ అంటరానితనాన్ని అధిగమించి అందరికీ సమాన హక్కులు కల్పించిన మహానుభావుడు అంబేద్కర్ అని కొనియాడారు. అంబేద్కర్ భిక్ష వల్లే తాను ఎమ్మెల్యేగా గెలుపొందానని స్పష్టం చేశారు. అనంతరం కొప్పరవలస గ్రామానికి చెందిన జాతీయ అందుల క్రికెట్ జట్టు కెప్టెన్ టొంపల దుర్గారావును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు, దళిత సంఘాల నాయకులు పాటల తూట ఉదయ్ భాస్కర్, బి బుద్ధుడు, యం.గణపతి, డి.రాంబాబు, రాజు, గణపతిరావు, గంగులు, కొప్పరవలస అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పలు గ్రామాలలో బీటీ రోడ్లకు శంకుస్థాపన

మండలంలోని పలు గ్రామాలకు మంజూరైన బీటీ రోడ్లకు ఎమ్మెల్యే కొండ్రు మురళీమోహన్ ఆదివారం శంకుస్థాపన చేశారు. వివిఆర్‌పేట, పెద్దింపేట బీటీ రోడ్డుకు సంబంధించి వివిఆర్ పేటలో కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. బంగారు వలస రాజులు గుమ్మడ బిటి రోడ్డుకు బంగారువలసలో, కొట్టేశ కొప్పర రోడ్డుకు కొట్టిశలో శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గురాన నారాయణరావు, బి.వాసుదేవరావునాయుడు, లచ్చుబుక్త కృష్ణమూర్తి, ఉదయాన మురళీ కృష్ణారావు, పైల వెంకటరమణ, బెజ్జిపురం రవి, చింత అప్పలనాయుడు, ఆయా గ్రామాల టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోండ్రు

కాలనీ అభివృద్ధిపై వివక్షత

ప్రజాశక్తి-బొబ్బిలి

గొల్లపల్లి అంబేద్కర్ కాలనీ అభివృద్ధిపై వైసిపి పాలకులు వివక్షత చూపారని ఎమ్మెల్యే బేబి నాయన అన్నారు. అంబేద్కర్ కాలనీలో రూ.90లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఆదివారం విజయ నగరం ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లా డుతూ పదో వార్డులో టిడిపి విజయం సాధించడంతో వైసిపి హయాంలో మున్సిపల్ పాలకవర్గం అభివృద్ధి చేయకుండా వివక్షత చూపారని విమర్శించారు. టిడిపి హయాంలో వివక్షత లేకుండా అభివృద్ధి చేస్తామన్నారు. ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ అభివృద్ధికి ఎంపి నిధులు రూ.50 లక్షలు, మున్సిపల్ సాధారణ నిధులు రూ.40లక్షలు కేటాయించినట్లు చెప్పారు. అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో బిజెపి కన్వీనర్ ఎం.రామారావునాయుడు, మున్సిపల్ ఛైర్మన్ రాంబార్కి శరత్, కమిషనర్ రామలక్ష్మి, కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదలకు అండగా సిఎం సహాయ నిధి

సిఎం సహాయ నిధి పేదలకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. స్థానిక కోటలో ఆదివారం సిఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేశారు. మండలంలోని గొర్లి సీతారాంపురం గ్రామానికి చెందిన జి.వెంకటరమణకు రూ.2.70లక్షలు, కోమటి పల్లికు చెందిన ఆవాల రమణమ్మకు రూ.40వేలు, కలవరాయికు చెందిన కె.గణేష్‌కు రూ.26వేలు, అలజం గికు చెందిన రెడ్డి కాములుకు రూ.23,920, బాడంగి మండలం, తెంటువలసకు చెందిన గొదబ రాజార మేష్‌కు రూ.1,69,837, తెర్లాం మండలం సుందరాడ గ్రామానికి చెందిన ముత్త సత్యంకు రూ.లక్ష, రామభద్ర పురం మండలం, కొట్టక్కి గ్రామానికి చెందిన కొట్టక్కి లక్ష్మీ పట్నాయక్ రూ67,983, ఎస్.సీతారాంపురానికి చెందిన బి.రామాసాయికు రూ.35వేలు, పాతరేగకు చెందిన వి.వెంకటనాయుడుకు రూ.35వేలు, బొబ్బిలి పట్టణం, గొల్లపల్లికి చెందిన పైల సీతారాం రూ.55వేలు, పట్టణానికి చెందిన రాంబర్కి ప్రసన్నకు రూ.45,541, బాడంగి మండలం, కోడూరు గ్రామానికి చెందిన కొల్లు రమణమ్మకు రూ.45,707, పి.వెంకంపేట గ్రామానికి చెందిన మూడడ్ల పైడితల్లికి రూ.28వేలు చెక్కులు అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్‌పి

నేటి నుంచి రాష్ట్ర స్థాయి పోటీలు

కంటోన్మెంట్: యోగాంధ్ర రాష్ట్ర స్థాయి పోటీలు ఈ నెల 16 నుంచి ఎన్‌టిఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లిలోని డాన్ బోస్కో హైస్కూల్లో ప్రారంభం కానున్నాయి. సోలో యోగా, గ్రూప్ యోగా, చిత్ర లేఖనం, పాటలు, పోస్టర్ డిజైన్, వ్యాసరచన తదితర పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల్లో పాల్గొనేందుకు జిల్లా నుంచి మొత్తం 25 మంది సభ్యుల బృందం బయల్దేరింది. వీరికి జిల్లా జాయింట్ కలెక్టర్, యోగాంధ్ర నోడల్ అధికారి ఎస్.సేతు మాధవన్, డిఆర్‌డిఎ పీడీ ఎ.కళ్యాణ చక్రవర్తి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సిఐ రమణ, ఎస్ఐ కిరణ్‌కుమార్

మండల పరిశీలకుడిగా సోంబాబు

ప్రజాశక్తి- పూసపాటి రేగ

విజయనగరం మండలంలోని తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీలు, బూత్ ఇన్చార్జులు, యూనిట్ ఇన్చార్జుల నియామక ప్రక్రియకు పరిశీలకుడిగా పూసపాటిరేగ మండలం కొవ్వాడ అగ్రహారానికి చెందిన సామంతుల సోంబాబును పార్టీ నియమించింది. ఈ మేరకు విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతిరాజు సోంబాబుకు సంబంధిత మెటీరియల్‌ను ఆదివారం అందజేశారు. గ్రామస్థాయిలో నియామకాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సోంబాబు తెలిపారు. ప్రస్తుతం సోంబాబు నెల్లిమర్ల నియోజకవర్గంలో క్లస్టర్ ఇన్చార్జిగా సేవలు అందిస్తున్నారు. ఆయన పనితీరుపై నమ్మకంతో ఈ కొత్త బాధ్యత అప్పగించినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా సోంబాబు మాట్లాడుతూ పార్టీ ఇచ్చిన బాధ్యతను నిష్పక్షపాతంగా నిర్వహిస్తానని తెలిపారు. ఆయనతోపాటు కొత్తకోట బాలకృష్ణ, శ్రీను ఉన్నారు.

నిజాయితీని చాటుకున్న యువకుడు

ప్రజాశక్తి - బొబ్బిలి

పట్టణంలోని టిఆర్ కాలనీకి చెందిన పి.సంతోష్ కుమార్‌కు స్మార్ట్ ఫోన్ దొరకడంతో ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తికి ఫోన్ అప్పగించి నిజాయితీని చాటుకున్నాడు. బొబ్బిలి స్వామివారివీధికి చెందిన రుషిప్రసాద్ తన స్మార్ట్ ఫోన్‌ను అదేవీధిలో పోగొట్టుకున్నాడు. ఫోన్ టిఆర్ కాలనీకు చెందిన పి.సంతోష్ కుమార్‌కు దొరకడంతో ఎస్ఐ రమేష్ సమక్షంలో రుషిప్రసాద్‌కు అప్పగించడంతో పోలీసులు అభినందించారు. ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తి సంతోష్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పురిటిపెంటలో గ్రామ సందర్శన

ప్రజాశక్తి - గజపతినగరం రూరల్

మండలంలోని పురటిపెంట గ్రామంలో సిఐ రమణ, ఎస్ఐ కిరణ్ కుమార్ నాయుడు ఆధ్వర్యంలో ఆదివారం గ్రామ సందర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాటా డుతూ సైబర్ నేరాలు, గంజాయి, మత్తు పదార్థాలు, రోడ్ యాక్సి డెంట్లు, ఆన్‌లైన్ బెట్టింగ్‌పై ప్రజలకు గ్రామ యువతకు అవగాహన ఉండాలన్నారు. ముఖ్యంగా మహిళలుకు శక్తి యాప్, మహిళా చట్టా లపై అవగాహన కలిగి ఉండాలని వాటి ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు కరణం ఆదినారాయణ, మండల సురేష్, గొర్లి బంగారు నాయుడు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.